క్లుప్తంగా

చురుగ్గా పారిశుధ్య పనులు



అగ్రహారంలో జేసీబీతో పెంట కుప్పల తొలగింపు

చీపురుపల్లి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను మేజర్ పంచాయతీ అధికారులు చేపట్టారు. సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు మంగళవారం మేజర్ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త తొలగింపు పనులు నిర్వహించారు. పిల్లపేట, జి.అగ్రహారం తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెంట కుప్పలను జేసీబీతో తొలగించారు. పనులను జూనియర్ అసిస్టెంట్ రాము పర్యవేక్షించారు.

తూనికలశాఖ అధికారుల తనిఖీలు



పండ్ల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉమా సుందరి

శృంగవరపుకోట: పట్టణంలోని దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరి మంగళవారం తనిఖీలు చేశారు. పలు కూరగాయల దుకాణాలు, రైతు బజార్లలో సోదాలు చేశారు. రోడ్లపై తోపుడు బండ్లమీద పండ్లు విక్రయాలు చేస్తున్న వారి వద్ద తూకంలో తేడాలను గుర్తించారు. తూనిక రాళ్లలో కిలోకు 200 గ్రాములు తక్కువ ఉండడంతో తూనికరాళ్లు, కాటాలకు సీళ్లు వేయించారు. అయిదుగురు పండ్ల వ్యాపారులపై కేసులు నమోదుచేశారు. స్థానిక రైతుబజారులో కూడా తూనికల్లో స్వల్పతేడాలు ఉన్నట్లు నిర్ధారించారు.

ఘనంగా గ్రామదేవతల పండగ



అమ్మవారి ఘటాల ఊరేగింపు

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లిలో గ్రామదేవతలు పరదేశమ్మ,పైడితల్లి అమ్మవార్ల పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారి ఘటాలను ఊరేగించారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.రాత్రి అనుపు మహోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం



చైతన్య బధిరుల పాఠశాలలో అన్నదానం

కొత్తవలస: మండలంలోని కోటపాడు రోడ్డులో ఉన్న చైతన్య బధిరుల పాఠశాలలో పిల్లలకు బలిఘట్టాం గ్రామానికి సమీపంలోని న్యూహోప్ ఆశ్రమ పాఠశాలలోని అనాథ పిల్లలు, వృద్ధులకు సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు వారు మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు కనకాల శివ మాట్లాడుతూ దుర్గాష్టమి సందర్భంగా దాతలు డి.విజయలక్ష్మి, వి.సునీత,యు.తనూజల సహాయంతో పిల్లలు, వృద్ధులకు అన్నదానం చేశామని చెప్పారు. ఆయా పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిలే దీక్షల్లో నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితులు తమ రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తున్నారు. మంగళవారం బొడ్డవరలో ఎమ్మెల్సీ రఘురాజు నివాసం ప్రాంగణంలో నిర్వాసితులు లగుడు అప్పలనాయుడు, పాగి రాము, సంగిరెడ్డి దేముడు, రామారావు, పల్లి ఈశ్వరరావు, కమల, పాగి కన్నాలమ్మ, రాచపల్లి లక్ష్మి, జన్ని సన్యాసమ్మ దీక్షలో కూర్చున్నారు. నిర్వాసితులు తమ డిమాండ్లను యథాప్రకారం వివరించారు. ప్రభుత్వం చొరవ చూసి తమకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

2న షిరిడిసాయి సమాధి ఉత్సవం

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో ఉన్న శ్రీ దత్తసాయి మందిరంలో షిర్డి సాయిబాబా 107వ సాయి సమాధి ఉత్సవం నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు తంగుడు రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా సహస్ర నామపారాయణం, షిరిడి సాయి పల్లకి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దుర్గాదేవికి కుంకుమ పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదో రోజు మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గజపతినగరం, చీపురుపల్లి,ఎస్.కోట నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో, దుర్గాదేవి మంటపాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మంటపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట: ఎల్.కోటలో దుర్గాదేవి మంటపం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని దేవీచౌక్‌లో పూజలందుకుంటున్న దుర్గాదేవి



మెరకముడిదాం: గోపన్నవలసలో దుర్గాదేవికి కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు



గుర్ల మండల కేంద్రంలో దీపాలంకరణ



లక్కవరపుకోట: భీమాళి గ్రామంలో చిన్నారులకు పలక, బలపంలు అందజేస్తున్న గ్రామ పెద్దలు, యువకులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో అన్నదానం



వేపాడ: జాకేరులో అన్నదానం



చీపురుపల్లి: దుర్గాదేవి అలంకరణలో మానసాదేవి నాగశక్తి



చీపురుపల్లి: దుర్గాదేవి అలంకరణలో కనకమహాలక్ష్మి



శృంగవరపుకోట: ధర్మవరంలో వారాహీదేవిగా దుర్గమ్మ



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు

కక్షసాధింపులు తప్ప అభివృద్ధి లేదు..



డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జామి: కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపులు తప్ప ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ ఆరోపించారు. టీడీపీ కూటమి వల్ల అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారని వారు చెప్పారు. సంబంధిత డిజిటల్ బుక్‌క్యూఆర్ కోడ్ పోస్టర్లను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్యాయంగా వైఎస్సార్‌సీపీ నేతలు,కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తోందని, పలు చోట్ల కూటమి నాయకులు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతీ కార్యకర్తకు అండగా నిలవాలన్నదే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని, కూటమి ప్రభుత్వం, నాయకుల వల్ల అన్యాయానికి గురవుతున్న ప్రతి ఒక్కరూ డిజిటల్ బుక్‌లో లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేయాలని సూచించారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులు, కూటమి నాయకులపై వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో హిందూపురం ఎమ్మెల్యే సినీ నటుడు బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వాఖ్యలు చేయడం కూటమి పాలనకు నిదర్శనమని అన్నారు.రాష్ట్ర ప్రజలు అంతా బాలకృష్ణను, కూటమి ప్రభుత్వ తీరును అసహ్యించుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి ఫణిబాబు, నేతలు కిలారి సూర్యారావు, ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు అప్పాన సుబ్రహ్మణ్యం, కరక దశరథ, శింగారపు అప్పలరాజు,లగుడు దేముడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం

జామి: లొట్లపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో గత అయిదు సంవత్సరాల్లో సుమారు రూ.8కోట్లు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ఎంపీపీ సబ్బవరపు అరుణ తెలిపారు. మంగళవారం లొట్లపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సామాజిక భవనం శ్లాబ్ పనులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్,స్థానిక సర్పంచ్ జన్నేల సింహచలంతో కలిసి మంగళవారం ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లొట్లపల్లి పంచాయతీలో సిమెంట్ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణం, గ్రామ సచివాలయం, రైతు భరోసాభవనాల నిర్మాణం, మన బడి నాడు-నేడు ద్వారా లొట్లపల్లి హైస్కూల్,ప్రాథమిక పాఠశాల,గొడికొమ్ము,రామయ్యపాలెం ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ,హైస్కూల్ రహదారి నిర్మాణం, మూడు గ్రామాల్లో అయిదుబోర్ల ఏర్పాటు, అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో తాగునీటి బోరు ఏర్పాటు,లొట్లపల్లి ఎస్టీ కాలనీ, గొడికొమ్ము గ్రామాల్లో తాగునీటికి అదనపు బోర్లు, లొట్లపల్లి ఎస్టీ,ఎస్సీ కాలనీల్లో జలజీవన్ మిషన్‌కింద ఇంటింటి కుళాయిల ఏర్పాటు,మండలపరిషత్ నిధులతో లొట్లపల్లి సచివాలయ ప్రహరీ నిర్మాణం వంటి అనేక పనులు చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. స్థానిక నాయకులు జన్నేల సూరిదేముడు, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక భవనం శ్లాబ్ నిర్మాణపనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ అరుణ, రవికుమార్

అన్నదాత సుఖీభవకు దూరం

మెరకముడిదాం: మండలంలోని పలువురు రైతులకు చెందిన జాయింట్ ఎల్‌పీఎంలు ఆన్‌లైన్ కాకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకానికి దూరమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సచివాలయ సిబ్బందిని కలిసినా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. అవసరానికి భూమి క్రయవిక్రయాలు జరగడంలేదంటూ గగ్గోలు పెడుతున్నారు. సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతున్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్నారు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

శృంగవరపుకోట: సర్పంచ్‌లకు రాజ్యాంగబద్ధంగా దఖలు పడిన హక్కులను ప్రభుత్వం ఆదేశాల మేరకు నడుస్తున్న పోలీసులు కాలరాస్తున్నారని మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్థానిక మండల పరిషత్‌కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. సోమవారం పెదఖండేపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్ యాళ్ల వెంకట రమణను ఎస్.కోట పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు అన్నారు. గ్రామసభలో ఉన్న సర్పంచ్‌ను నిర్బంధించడం పోలీసుల దాష్టీకానికి నిదర్శనం అన్నారు. అనంతరం స్థానిక దేవీ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, రంది అనంత్, మమ్ములూరి సోంబాబు, శివరామరాజుపేట సర్పంచ్ కొట్యాడ ఝాన్సీ, ఎంపీటీసీలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, రాకోటి ధారగిరి, బి.ఆదిలక్ష్మి, బోదల దేముడు, పార్వతి, బోజంకి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే ఎందుకంత చిన్న చూపు..?

- ప్రారంభానికి నోచుకోని జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్
- గత ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణం పూర్తి
- ల్యాబ్‌కు పరికరాలు సమకూర్చడంలో తాత్సారం చేస్తున్న కూటమి ప్రభుత్వం



నెలివాడలో ప్రారంభానికి నోచుకోని జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ భవనం

బొండపల్లి: కూటమి ప్రభుత్వానికి రైతులు అంటే ఏంత చిన్న చూపో మండలంలోని నెలివాడ వద్ద ప్రారంభానికి నోచుకోని జిల్లా స్థాయి సమీకృత వ్యవసాయ ప్రయోగశాల (ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్) భవనాన్ని చూస్తూ ఇట్టే అర్థమ వుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ జిల్లాలో ఒక ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. విజయనగరం జిల్లాకు సంబంధించిన ల్యాబ్‌ను మండలంలోని నెలివాడ వద్ద ఏర్పాటు చేసేందుకు 2020 జూన్8వ తేదీన అప్పటి రాష్ట్ర మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ, గజపతినగరం ఎమ్మెల్యేగా ఉన్న బొత్స అప్పలనరసయ్య భూమి పూజ చేశారు. కోవిడ్ వంటి కష్ట కాలం ఎదురైన ప్పటికీ రూ.3.68 కోట్లతో 2023 సంవత్సరం చివరి నాటికి భవన నిర్మాణాలను పూర్తి చేశారు. ఇక ల్యాబ్ లో పరికరాలు ఏర్పాటు చేసి ప్రారంభించడానికి సిద్ధమవుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఎక్కడి ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది.

పట్టించుకున్న పాపాన పోలేదు

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈల్యాబ్ గురించి ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. గజపతినగరం నుంచి ఎమ్మెల్యే గెలిచిన టీడీపీ కూటమి ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు దక్కినప్పటికీ జిల్లాకు కానీ నియోజకవర్గానికి కానీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. నిర్మాణమంతా పూర్తయిన అగ్రిల్యాబ్ భవనం లో పరికరాలు సమకూర్చి దానిని ప్రారంభించాలనే కనీస ఆలోచన మంత్రి ఇంతవరకు చేసిన దాఖలాలు లేవని, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ల్యాబ్ అంశంపై అధికారులతో చర్చించినట్లు కానీ తామెక్కడా వినలేదని పలువురు రైతులు అంటున్నారు. ల్యాబ్ అందుబాటు లోకి వస్తే విత్తనాల నాణ్యతతో పాటు భూసార పరీక్షలు చేయించుకోవచ్చు. సాగు సంబంధిత సలహాలు, సూచనలు పొందవచ్చు. ఇక్కడి ల్యాబ్ ప్రారంభం కాకపోవడంతో ఇక్కడి రైతులు విత్తన నాణ్యత పరీక్షలు, ఇతర సేవలకు పొరుగు జిల్లాల్లోని ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ల్యాబ్ భవనం ఉన్నప్పటికీ పొరుగు జిల్లాలకు వెళ్లాల్సి రావడంపై రైతులు మండిపడుతున్నా రు. కేవలం ల్యాబ్‌లో పరికరాలుఏర్పాటు చేసి, శాస్త్రవేత్తలను నియమించడానికి కూటమి ప్రభుత్వానికి ఏడాదిన్నర కాలం సరిపోలేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ల్యాబ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పథంలో కెల్ల సొసైటీ



కెల్ల సొసైటీ మాజీ చైర్మన్ సూర్యనారాయణరాజును సత్కరిస్తున్న కెల్ల సొసైటీ చైర్మన్ విమలరాణి, కార్యవర్గ సభ్యులు

గుర్ల: మండలంలోని కెల్ల సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండేలా చేసిన ఘనత సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణకే దక్కుతుందని కెల్ల సొసైటీ చైర్మన్ కె.విమలరాణి కొనియాడారు. కెల్ల సొసైటీ ఆవరణలో ఆయనను నూతనంగా నియామకమైన చైర్మన్, కార్యవర్గ సభ్యులు మంగళవారం సత్కరించారు. కెల్ల సొసైటీ ఆర్థికంగా బలంగా ఉందని, రైతులకు అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి సహకరించిన సొసైటీ సిబ్బందికి సూర్యనారాయణ రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కెల్ల సురేష్, కెల్ల పైడిరాజు, సొసైటీ సీఈఓ మండల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పాటుపడిన మహనీయుడు పూలే

- 'దళిత విముక్తి' ఆధ్వర్యంలో సత్యశోధక్ మహాసభ,ర్యాలీ
- మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటీకరణ దారుణం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న 'దళిత విముక్తి' ప్రతినిధులు, అతిథులు



మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం

కొత్తవలస: అగ్రవర్ణాల అరాచకాలతో నాటి సమాజం తీవ్ర అసమానతలకు గురైన సమయంలో మనుషులంతా సమానమేనని చాటి చెప్పిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని యూపీఎస్సీ పూర్వ సభ్యులు, ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు.మహాత్మ జ్యోతీరావుపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్‌కు 152 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దళిత విముక్తి రాష్ట్ర కార్యదర్శి సుర్ల వెంకటరమణ అధ్యక్షతన మండలంలోని ఓ ప్రవేట్ కల్యాణ మంటపంలో మంగళవారం మహాసభ నిర్వహించారు. ముందుగా రైల్వే స్టేషన్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ చేసి, కొత్తవలస కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ప్రారంభమైన సభలో ముఖ్యఅతిథులు కె.ఎస్.చలం, దామోదర సంజీవయ్య లా యూనివర్శిటీ సహాయ ప్రొఫెసర్ కె.సుధ, లీడర్ పత్రిక సంపాదకులు వి.వి.రమణమూర్తి తదిత రులు మాట్లాడారు. జ్యోతీరావుపూలే తన జీవిత భాగస్వామి సావిత్రీబాయి పూలేతో కలిసి 1873లో సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారని గుర్తు చేశారు.అసమానతలకు కారణ మైన కులవ్యవస్థను, దానికి మూలమైన మనువాదాన్ని వ్యతిరేకించారన్నారు. అసమానతులతో పాటు మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ స్వేచ్ఛ, సాంఘిక సమానత్వం సమాజంలో అందరికీ అందాలనే లక్ష్యంతో అనేక పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను అందించిన మహనీయులు పూలే దంపతులని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూలే ఆశ యాలను తుంగలో తొక్కి మతత్వాన్ని ప్రజలపై రుద్దుతోందని ఆరోపించారు.మహిళలు,చిన్నారులపై నిత్యం ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, పోర్టు,ఎల్ఐసీ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లకు విఘాతం కలిగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడం దారుణమని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీల ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కె.సుందరరావు, వి.ఎస్.కృష్ణ, నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామూర్తి,జాతీయ హేతువాద సంఘాల సమైఖ్య కార్యదర్శి ఎం.ఎస్.బుద్ధ,దళిత విముక్తి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువు రాపర్తి జయంతి వేడుకలు



వేడుకల్లో భాగంగా నృత్య ప్రదర్శన

జామి: మండలంలోని విజినిగిరి యోగా చైతన్య సంస్థలో ఆసంస్థ అధ్యక్షుడు టి.ఎల్.నరసింహారావు ఆధ్వర్యంలో యోగా గురుదేవులు రాపర్తి రామారావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్,విశాఖపట్నానికి చెందిన ఆర్.వి. ఆర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరావు, ఇన్‌కమ్ ట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ జె.సిరి కుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. యోగా కోసం గురువు రాపర్తి చేసిన కృషిని వివరించారు. వివిధ జిల్లాలు, పలురాష్ట్రాలకు చెందిన యోగా సాధకులు, ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అన్నసమారాధన చేశారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం: ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్‌కనెక్షన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెరకముడిదాం ఆశ్రిత ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు. రేషన్‌కార్డు జెరాక్స్, కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు జెరాక్స్‌లు, లబ్ధి దారు బ్యాంకు బుక్ జెరాక్స్, రెండు పాస్‌ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.